# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 7న రాష్ట్రంలో పర్యటిస్తారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.**

**2.** **ఈనెల 13న జరగబోయే ఎన్నికలు రాబోయే 5 ఏళ్ళ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి  అన్నారు.**

**3.** **ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈరోజు సాయంత్రంలోగా రుసుము చెల్లించవచ్చని ఇంటర్మీడియట్ విద్యామండలి పేర్కొంది.**

**4.** **గురుకులాల పరిధిలోని ఏకలవ్య-ఈఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ తెలిపింది.**

**5.** **ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య జయంతి ఈరోజు.**

==========================

బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 7న రాష్ట్రంలో పర్యటిస్తారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న సీఎం రమేశు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 7న అనకాపల్లి రానున్నారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని ఉగ్గినపాలెం వద్ద  జరిగే  బహిరంగ సభలో పాల్గొంటారని అనంతరం  తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బహిరంగ సభలో పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

--------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు  విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలోని బొబ్బిలిలో జరిగిన ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..మే 13న జరగబోయే ఎన్నికలు రాబోయే 5 ఏళ్ళ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నారు. తమ ప్రభుత్వ పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చామని, అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా 2.70 లక్షల కోట్ల రూపాయలను నేరుగా లబ్దిదారుల ఖాతాలకు జమ చేశామని అన్నారు.

కాగా.. ఈ మధ్యాహ్నం అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని పాయకరావుపేటలో జరిగే సభలో పాల్గొంటారు. అలాగే ఏలూరులో జరిగే ప్రచార సభలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

---------------------------

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈరోజు సాయంత్రంలోగా రుసుము చెల్లించవచ్చని ఇంటర్మీడియట్ విద్యామండలి ఒక ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ 30 వరకు ఇచ్చిన గడువును కళాశాలల అభ్యర్థన మేరకు ఈ రోజు సాయంత్రం వరకు పొడిగించినట్లు ప్రకటనలో పేర్కొంది. విద్యార్థుల ప్రయోజనం కోసం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఈ రోజు సాయంత్రం ఆరుగంటల్లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించింది.

---------------------------

గురుకులాల పరిధిలోని ఏకలవ్య-ఈఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎస్. భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, హెచ్ఇపీ గ్రూపులకు మే 3వ తేదీ నుంచి 18వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలు www.aptwgurukulam.ap.gov.in లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ హక్కును వినియోగించుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా అలిపిరి, పాకాల, చిట్టమూరు, వాకాడు పోలీస్ స్టేషన్ పరిధిలో కేంద్రబలగాలు ఈ ఉదయం భారీ కవాతును నిర్వహించాయి. ఈ సందర్భంగా కృష్ణ కాంత్ పటేల్ మాట్లాడుతూ ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఓటింగ్ శాతాన్ని పెంచాలన్న లక్ష్యంతోనే ఓటర్లకు అవగాహన కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతును నిర్వహించామని తెలిపారు.

---------------------------

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్ పేర్కొన్నారు. నిన్న అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభకి పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సామాజిక, డిజిటల్ మాధ్యమాల్లో చేసే ప్రచార వ్యయాన్ని కూడా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకులు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట

వీరుడు పుచ్చలపల్లి సుందరయ్య జయంతి ఈరోజు. 1913 మే 1వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి నెల్లూరుజిల్లా అలగానిపాడు గ్రామంలో జన్మించిన ఆయన.... కమ్యూనిస్టు గాంధీగా పేరుపొందారు. తెలుగు రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖులు. కుల వ్యవస్థను నిరసించిన మహనీయుడు. స్వాతంత్ర్య సమరంలో అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1985 మే 19వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు.

---------------------------

శ్రీ సత్యసాయి జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్ పోస్ట్‌లలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. నిన్న ఆయన మడకశిర సరిహద్దులో ఉన్న చెక్ పోస్ట్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణా జరగకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. అనంతరం సమస్యాత్మకమైన గ్రామాలైన హరేసముద్రం, గుండుమల, వైవిహళ్లి, కళ్ళుమర్రి, రొళ్ల మండలంలోని రత్నగిరి గ్రామాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చని సూచించారు.

---------------------------

సముద్రంలో వేట నిషేధిత కాలంలో అందించే మత్స్యకార భృతి కోసం అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ నెల 2 నుంచి గణన ప్రారంభిస్తున్నట్లు మత్స్యశాఖ కమిషనర్ ఏ. సూర్యకుమారి తెలిపారు. సముద్రజలాల్లో 61 రోజుల పాటు చేపలవేటను నిషేధించి నందున, జీవనోపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు ఏటా చెల్లిస్తున్న విధంగానే ఈ ఏడాది కూడా వేట నిషేధ భృతి అందించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఎన్నికల సంఘం అనుమతిని తీసుకున్నట్లు చెప్పారు. గ్రామ స్థాయిలో చేపట్టే ఈ గణనకు నిబంధనల మేరకు అర్హులైన వారిని గుర్తిస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 35 సెకన్లు...

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశం పట్ల సూక్ష్మ పరిశీలకులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్ అన్నారు. బాపట్లలో జరిగిన సూక్ష్మ పరిశీలకులకు శిక్షణా కార్యక్రమాన్నీ నిర్వహించారు. ఈసందర్భంగా పరిమళ సింగ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ సూక్ష్మ పరిశీలకులు మరింత శిక్షణ పొందాలన్నారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా 337 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు వున్నాయని, ఆ ప్రాంతాలలో వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామన్నారు. సూక్ష్మ పరిశీలకులంతా ఎన్నికల సాధారణ పరిశీలకుల ఆధీనంలో విధులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీన మరోసారి శిక్షణ ఉంటుందని తెలిపారు.

---------------------------

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ –ఐసీసీ జూన్ 1 నుంచి 29 వరకు నిర్వహించే 9వ టి20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యులతో భారత జట్టును బిసిసిఐ ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బోర్డు సెలక్షన్ కమిటీ నిన్న సమావేశమై ఆటగాళ్లను ఎంపిక చేసింది. రోహిత్ శర్మను కెప్టెన్ గా, హార్దిక్ పాండ్యా వైస్ కెప్టెన్‌గా, ఎంపిక చేశారు. కాగా ప్రపంచ కప్ లో గ్రూప్ 'బి'లో ఉన్న భారత్ జట్టు జూన్ 5న తమ తొలి క్రికెట్ మ్యాచ్‌లో ఐర్లాండ్ జట్టుతో తలపడనుంది.

---------------------------

సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే జంక్షన్, బోనకల్, మధిర, తదితర రైల్వే స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడోలైన్ ఇంజినీరింగ్ పనుల కారణంగా కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నడిచే పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

=======================